క్లుప్తంగా

మట్టిరోడ్డుపై జాతీయజెండా



బోయినపల్లి: కరీంనగర్–సిరిసిల్ల ప్రధాన రహదారి మండలంలోని వెంకట్రావుపల్లిలో కొనసాగుతున్న ఫోర్‌లేన్ రోడ్డు పనుల్లో జాతీయపతాకం నేలకు తాకి ఉండడంపై కలకలం రేపింది. జాతీయజెండా ఇలా నేలకు తాకుతూ ఎవరు పెట్టారో తెలియడం లేదు. రోడ్డు పనులు కొనసాగుతుండడంతో వాహనదారులకు హద్దు కనిపించేలా ఇలా జెండాను ఎవరో ఏర్పాటు చేసి ఉంటారని స్థానికులు భావిస్తున్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత

వేములవాడరూరల్: తంగళ్లపల్లి మండలం రామన్నపేట గ్రామానికి చెందిన తిరుపతి వేములవాడరూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో సెల్‌ఫోన్ పోగొట్టుకున్నాడు. బాధితుడు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. సీఈఐఆర్ ద్వారా మొబైల్ స్వాధీనం చేసుకొని సోమవారం బాధితుడికి అందజేశామని ఎస్‌ఐ మారుతి తెలిపారు. మొబైల్ ఫోన్ పోతే సెంట్రల్ ఎక్విప్మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ పోర్టల్‌లో పూర్తి వివరాలు నమోదు చేస్తే పోయిన ఫోన్‌ను నేరుగా బ్లాక్ చేయవచ్చని వివరించారు.

స్కూల్‌కు రూ.30వేల విరాళం



వేములవాడరూరల్: మండలంలోని వట్టెంల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు అమెరికాలో ఉంటున్న మట్టల తిరుపతి, మట్టల భూలక్ష్మి రూ. 30 వేలు అందించారు. నగదును ఆకుల మహేశ్ పాఠశాల చైర్మన్ ఆంజనేయులు, ప్రధానోపాధ్యాయులు సూర్యనారాయణకు సోమవారం అందజేశారు. ఈసందర్భంగా దాతకు పాఠశాల నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

అంబేడ్కర్ యువజన సంఘం ఎన్నికలు

ముస్తాబాద్: ఆవునూర్ అంబేడ్కర్ యువజన సంఘం ఎన్నికలను సోమవారం నిర్వహించారు. అధ్యక్షుడిగా బండ చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడిగా మంత్రి రాజయ్య, ప్రధాన కార్యదర్శిగా బత్తుల శ్రావణ్, సంయుక్త కార్యదర్శిగా నవీన్, కోశాధికారిగా సొల్ల చంద్రం, పది మంది సలహాదారులుగా ఎన్నికయ్యారు.

తాటిచెట్టు పై నుంచి పడి గీత కార్మికుడికి గాయాలు

చందుర్తి: నర్సింగాపూర్‌కు చెందిన గీతకార్మికుడు జాగిరి రవి తాటిచెట్టుపై నుంచి కింద పడి తీవ్రంగా గాయపడ్డాడు. రోజుమాదిరిగానే సోమవారం సాయంత్రం కల్లు గీసేందుకు తాటి చెట్టు ఎక్కాడు. ప్రమాదవశాత్తు మోకు జారి కిందపడ్డాడు. ఈ సంఘటనలో రవి కాళ్లకు, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించారు.

కాలినడకతో వేములవాడకు..

వేములవాడఅర్బన్: రాష్ట్ర ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన సందర్భంగా రేవంత్‌రెడ్డి టీమ్ ముఖ్య సభ్యుడు ఈశ్వర్ వేములవాడ రాజన్నను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నాడు. కరీంనగర్ నుంచి వేములవాడ వరకు 40 కిలోమీటర్లు ఈశ్వర్ కాలినడకతో వచ్చి దర్శనం చేసుకున్నట్లు తెలిపారు. స్వామి దర్శనం అనంతరం ఈశ్వర్‌కు ఆలయ అర్చకులు ప్రసాదం అందజేశారు.

పుస్తెమెట్టెలు అందజేత



ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రానికి చెందిన నిరుపేద కుటుంబానికి సర్పంచ్ నేవూరి వెంకట్‌రెడ్డి పుస్తెమెట్టెలు అందించారు. కొత్త బాలవ్వ–నర్సయ్య దంపతుల కూతురు లావణ్య వివాహానికి సోమవారం పుస్తెమెట్టెలు అందించారు. గన్న మల్లారెడ్డి, గడ్డమీది లావణ్య, ద్యాగం నారాయణ, భాస్కర్, అశోక్, వెంకటేశ్, జితేందర్, దేవరాజు పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం


స్వాతి

వేములవాడఅర్బన్: వేములవాడలో నివసిస్తున్న కందలే స్వాతి అనే వివాహిత ఆదివారం అదృశ్యమైందని స్థానిక టౌన్ సీఐ కరుణాకర్ తెలిపారు. భర్త ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. సీఐ తెలిపిన వివరాలు. జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం ముకతునూర్‌కు చెందిన కందలే స్వాతి(28) భర్త సంయల్‌తో కలిసి వేములవాడలో ఉంటున్నారు. స్వాతి ఆదివారం ఉదయం బద్దిపోచమ్మ ఆలయం సమీపం నుంచి వెళ్లి.. రాత్రి వరకు కూడా తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అధ్వానంగా అంతర్గత రోడ్లు


గుంతలుపడ్డ ఎన్గల్–మామిడిపల్లి మధ్య లింక్‌రోడ్డు


కిష్టంపేట–బండపల్లి గ్రామాల మధ్య లింక్‌రోడ్డు వర్షాకాలంలో ఇలా..

- కాలినడకన వెళ్లాలన్నా కష్టమే
- రాకపోకలకు ఇబ్బందులు
- మరమ్మతులు చేపట్టాలని డిమాండ్

చందుర్తి: మోకాలు లోతు గుంతలు.. చిన్నపాటి వర్షానికే బురదమయం.. అడుగుతీసి అడుగువేయలేని అధ్వాన రహదారులు.. ఇవీ చందుర్తి మండలంలోని పల్లెల్లో కనిపించే అంతర్గత రోడ్ల దుస్థితి. మండలంలోని పలు గ్రామాల్లోని లింక్ రోడ్లు అధ్వానంగా మారాయి. గత తొమ్మిదేళ్లుగా మరమ్మతులు చేపట్టకపోవడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఎన్నికల్లో నాయకుల హామీలు తప్ప రోడ్లను బాగు చేయడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మోకాలు లోతు గుంతలు

మండలంలోని బండపల్లి–కిష్టంపేట, కిష్టంపేట, కట్టలింగంపేట, గుడిపేట–ఎన్గల్, ఎన్గల్–మామిడిపల్లి మధ్య లింక్‌రోడ్లు అధ్వానంగా మారాయి. చిన్నపాటి వర్షానికే రోడ్లన్నీ బురదమయంగా మారుతున్నాయి. కనీస మరమ్మతులు చేపట్టకపోవడంతో రైతులు పొలాల వద్దకు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో మార్కెట్ కమిటీ నిధులతో మరమ్మతులు చేపట్టేవారు. తొమ్మిదేళ్లుగా మార్కెట్ కమిటీ నిధులు వినియోగానికి ఆంక్షలు విధించడంతో పనులు చేపట్టడం లేదు. కొన్నిసార్లు రైతులే సొంతంగా మరమ్మతులు చేపడుతున్నారు.

ఐదు గ్రామాల రోడ్లు బాగుచేస్తేనే..

మండలంలోని ఐదు గ్రామాల లింక్‌రోడ్ల పనులు పూర్తి చేస్తేనే మండలంలోని అన్ని గ్రామాలకు రవాణా కష్టాలు తీరుతాయి. మండలంలోని బండపల్లి–కిష్టంపేట, కిష్టంపేట–కట్టలింగంపేట, చందుర్తి–నర్సింగాపూర్, ఎన్గల్–మామిడిపల్లి, రామన్నపేట –ఆశిరెడ్డిపల్లె గ్రామాల రోడ్లు పూర్తి చేస్తే చందుర్తి మండలంతోపాటు కోనరావుపేట మండలంలోని బావుసాయిపేట, మామిడిపల్లి, నిజామాబాద్, వెంకట్రావుపేట, కోనరావుపేట, మలకపేట, కనగర్తి గ్రామాలకు రవాణా సులభమవుతుంది. ఈ రోడ్డు గుండా రుద్రంగి, కోరుట్ల పట్టణ ప్రాంతాలకు రవాణా మెరుగవుతుంది.

ప్రకటనలతోనే మభ్యపెట్టారు

ఎన్నికలకు ముందు ప్రజలు ఎక్కడ నిలదీస్తారోనని ముందస్తుగా లింక్‌రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని అప్పటి అధికార పార్టీ బీఆర్‌ఎస్ నాయకులు ప్రకటనలు చేసి మభ్యపెట్టారని ఎన్గల్, మామిడిపల్లి, కిష్టంపేట, బండపల్లి గ్రామాల ప్రజలు విమర్శిస్తున్నారు. గత నవంబర్‌లో బండపల్లి–కిష్టంపేట గ్రామాల మధ్య లింక్‌రోడ్డు మరమ్మతుకు రూ.25లక్షలు మంజూరయ్యాయని అప్పటి ఎమ్మెల్యేనే ప్రకటించారు. కానీ ఇప్పటి వరకు ఈ రోడ్డుపై తట్టెడు మట్టి పోసిన దాఖలాలు లేవని ఆ రెండు గ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా చందుర్తి మండలం ఎన్గల్, కోనరావుపేట మండలం మామిడిపల్లి గ్రామాల లింక్ రోడ్డు నిర్మాణానికి రూ.2 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. కానీ ఆ పనులకు అతీగతీ లేకుండా పోయింది.

మరమ్మతు చేపట్టాలి



కట్టలింగంపేట– కిష్టంపేట గ్రామాల మధ్య లింక్‌రోడ్డు రెండేళ్లుగా భారీ వర్షాలకు కోతకు గురైంది. ద్విచక్రవాహనాలు తప్ప ఇతర వాహనాలు వెళ్లలేని పరిస్థితి. ఈ దారి గుండా రోజూ వందల సంఖ్యలో ద్విచక్రవాహనాలు, ట్రాక్టర్లు నడుస్తాయి. అధికారులు రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలి.

– యెల్ల దశరథం, కట్టలింగంపేట

పట్టించుకోవడం లేదు



బండపల్లి –కిష్టంపేట గ్రామా ల మధ్య లింక్ రోడ్డు గుంతలమయమైంది. వర్షాకాలంలో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. ఎప్పుడు ఏ ప్రమాదం చోటు జరుగుతుందోనని ద్విచక్రవాహనాదారులు భయాందోళనకు గురవుతున్నారు. రోడ్డు నిర్మాణానికి రూ.25 లక్షలు మంజూరయ్యాయని సంతోషపడ్డాం. ఏడాదైనా పనులు చేపట్టలేదు. అధికారులు పట్టించుకోవడం లేదు.

– న్యాత దినాకర్, బండపల్లి

నిధులు మంజూరు కాలేదు



చందుర్తి –కోనరావుపేట మండలాల సరిహద్దు గ్రామాలైన ఎన్గల్–మామిడిపల్లి లింక్‌రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామని గత 15 ఏళ్లుగా నాయకులు చెబుతున్నారు. కానీ ఇప్పటి వరకు నిధులు మంజూరు కాలేదు. మూడు నెలల క్రితం రూ.2కోట్లు మంజూరయ్యాయని మాజీ ఎమ్మెల్యే రమేశ్‌బాబు తెలిపారు. ఇప్పటి వరకు ఎలాంటి పని చేయలేదు.

– లాండే తిరుపతి, ఎన్గల్

సాదాసీదాగా మండల సమావేశం

- ప్రజాసమస్యలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి
- రుద్రంగి ఎంపీపీ గంగం స్వరూపారాణి
- మండలంలోని పలు సమస్యలపై చర్చ


మాట్లాడుతున్న ఎంపీపీ గంగం స్వరూపారాణి

రుద్రంగి: ప్రజాసమస్యలపై అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక శ్రద్ధ వహించి వెంటనే పరిష్కరించాలని ఎంపీపీ గంగం స్వరూపారాణి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని రైతువేదికలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా జరిగింది. అధికారులు మూడు నెలల ప్రగతి ప్రణాళికతో సర్వసభ్య సమావేశానికి హాజరై చదివి వినిపించారు. మండల కేంద్రంలో రోడ్డు వెడల్పులో భాగంగా చేపట్టిన పనుల్లో విద్యుత్ స్తంభాలు రోడ్డుపైకి వచ్చాయని వాటిని వెంటనే తొలగించాలని విద్యుత్ అధికారులకు సూచించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ సెంటర్ల ద్వారా బాలింతలు, గర్భిణులకు అందించే పోషక పదార్థాలు సరిగా అందడం లేదనే ఆరోపణలున్నాయని, మంచి పోషక విలువలున్న ఆహారం తప్పకుండా అందజేసి ప్రభుత్వ లక్ష్యం నెరవేరేలా చూడాలన్నారు. వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో నాలుగేళ్లుగా రైతులకు ఆయిల్‌పామ్ సాగు చేయాలని అవగాహన కల్పిస్తున్నా.. ఎందుకు సాగు కావడం లేదు వ్యవసాయశాఖ అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యవేక్షించాలన్నారు. కొందరు అధికారులు సర్వసభ్య సమావేశానికి గైర్హాజరవుతున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో మాలోతు శంకర్‌ను ఆదేశించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యసేవలు అందిస్తున్న నేపథ్యంలో ప్రభుత్వ ఆస్పత్రుల్లో వందశాతం ప్రసవాలు జరిగేలా వైద్య అధికారులు ప్రత్యేకంగా అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో మాలోతు శంకర్, వైస్ ఎంపీపీ పీసరి చిన్న భూమయ్య, ఎంపీవో సుధాకర్, ఎంపీటీసీలు, మండల వైద్యాధికారి సంపత్ కుమార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మమత తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన


కేంద్ర ప్రభుత్వ పథకాల ప్రదర్శనలో విద్యార్థులు

గంభీరావుపేట: మండలంలోని లింగన్నపేటలో సోమవారం వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. ప్రత్యేకంగా రూపొందించిన వీడియోలు, ప్రధాన మంత్రి నరేంద్రమోదీ సందేశాన్ని ప్రదర్శించారు. విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీవో రాజశేఖర్, ఏపీవో అరుణ, ఉప సర్పంచ్ రాజు, జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం మనోహర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మజ పాల్గొన్నారు.

వీర్నపల్లి: మండలంలోని వన్‌పల్లిలో సర్పంచ్ జోగినిపల్లి లత ఆధ్వర్యంలో వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర నిర్వహించారు. ఎంపీడీవో నరేశ్ కుమార్, టీజీబీ రీజినల్ మేనేజర్ సుశాంత్ ఉన్నారు.

తంగళ్లపల్లి: మండలంలోని జిల్లెల్లలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహించారు. సర్పంచ్ మాట్ల మధు, సింగిల్‌విండో చైర్మన్ కోడూరి భాస్కర్, మండల వ్యవసాయాధికారి సందీప్, ఇన్‌చార్జి ఎంపీవో విజయేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

చందుర్తి: కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అర్హులకు అందించేందుకు వికసిత్ భారత్ సంకల్ప యాత్ర ఉద్దేశమని ఎంపీడీవో పత్తి రవీందర్ అన్నారు. సోమవారం చందుర్తి గ్రామపంచాయతీ ఆవరణలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహించారు. మండలంలోని ప్రతి గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణలో ఈ కార్యక్రమం చేపట్టనున్నామని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ సిరికొండ ప్రేమలత, ఉపసర్పంచ్ చిర్రం తిరుపతి, ఎంపీవో ప్రదీప్‌కుమార్, వార్డు సభ్యులు, నాయకులు కోల కిష్టస్వామి, సిరికొండ శ్రీనివాస్, పోంశెట్టి రాకేశ్, మార్త సత్తయ్య పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లోకి స్వార్థంతో రావొద్దు

- పీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఉమేశ్‌రావు


మాట్లాడుతున్న చీటి ఉమేశ్‌రావు

సిరిసిల్లటౌన్: కాంగ్రెస్ పార్టీలోకి వచ్చే వారు నిస్వార్థంగా ప్రజాసేవ కోసం రావాలని, పదవులు ఆశించొద్దని ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి చీటి ఉమేశ్‌రావు పేర్కొన్నారు. సిరిసిల్లలోని ప్రెస్‌క్లబ్‌లో సోమవారం విలేకరులతో మాట్లాడారు. కొత్తగా వచ్చే నేతలకు పదవులు రావని ఈ విషయమై పార్టీ పెద్దలతో నేరుగా మాట్లాడినట్లు తెలిపారు. ఇన్నాళ్లు రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజలను మోసగించి పాలన చేసిందన్నారు. ఆరు గ్యారంటీలలో రెండు అమలయ్యాయని, మిగతావి త్వరలోనే అమల్లోకి వస్తాయన్నారు. వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు ప్రభుత్వ విప్ పదవి రావడంపై హర్షం వ్యక్తం చేశారు. జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి వెంగల అశోక్, మదన్, వెంకటేశం, భూపాల్‌రెడ్డి, మహిపాల్, శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

మంత్రి పొన్నంను కలిసిన నాయకులు


మంత్రిని కలిసిన కాంగ్రెస్ నాయకులు

ఎల్లారెడ్డిపేట/తంగళ్లపల్లి/చందుర్తి/ముస్తాబాద్: రాష్ట్ర రవాణా,బీసీ సంక్షేమశాఖ మంత్రిగా సోమవారం బాధ్యతలు చేపట్టిన పొన్నం ప్రభాకర్‌ను ఎల్లారెడ్డిపేట కాంగ్రెస్ నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య,మండల అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి,నాయకులు వంగ గిరిధర్‌రెడ్డి, మర్రి శ్రీనివాస్‌రెడ్డి, పసుల కృష్ణ, ఎస్కే గౌస్, గూడ విజయ్‌రెడ్డి ఉన్నారు. తంగళ్లపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జాలగం ప్రవీన్(టోని), చందుర్తి జెడ్పీటీసీ నాగం కుమార్, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు ధర్మపురి శ్రీనివాస్, సీనియర్ నాయకుడు భీంరాజు కనకరాజు, ముస్తాబాద్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి, ఎంపీటీసీ శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

జాతీయస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక


రిషికను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ఎల్లారెడ్డిపేట: మండలంలోని రాచర్లబొప్పాపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని పొన్నాల రిషిక రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలలో ప్రతిభ కనబర్చి జాతీయస్థాయికి ఎంపికైంది. ఈనెల 12 నుంచి 15 వరకు మహబూబ్‌నగర్ జిల్లా నారాయణపేటలో జరిగిన రాష్ట్రస్థాయి అండర్–14 విభాగంలో ప్రతిభ కనబర్చినట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు పంతం ప్రభాకర్ తెలిపారు. ఈనెల 21 నుంచి 25 వరకు ఒడిశా రాష్ట్రంలోని భువనేశ్వర్‌లో జరిగే జాతీయ స్థాయి ఎస్‌జీఎఫ్ పోటీలలో రిషిక పాల్గొంటుందని తెలిపారు. రిషికను సర్పంచ్ కొండపురం బాల్‌రెడ్డి, హెచ్ఎం, ఎస్ఎంసీ చైర్మన్, ఉపాధ్యాయులు అభినందించారు.

అడిషనల్ కలెక్టర్‌కు అభినందనల వెల్లువ


గౌతమికి అభినందనలు తెలుపుతున్న ఎంపీడీవోలు


పూలమొక్క అందిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్


పూలమొక్క అందిస్తున్న ఖీమ్యానాయక్

సిరిసిల్ల: అడిషనల్ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన పూజారి గౌతమికి సోమవారం అభినందనలు వెల్లువెత్తాయి. అదనపు కలెక్టర్(రెవెన్యూ) ఎన్.ఖీమ్యానాయక్ పూలమొక్కను అందించారు. జిల్లాలోని అన్ని మండలాల ఎంపీడీవోలు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా అధికారుల సంఘం నాయకులు అడిషనల్ కలెక్టర్ చాంబర్‌లో పూలమొక్కను అందించి శుభాకాంక్షలు తెలిపారు. సిరిసిల్ల మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి, మున్సిపల్ కమిషనర్ మీర్జా ఫాసహత్ అలీబేగ్, పట్టణ ప్రణాళిక అధికారి అన్సారి, డీఈఈ ప్రసాద్, మేనేజర్ రాజురెడ్డి తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్‌లోకి తంగళ్లపల్లి జెడ్పీటీసీ

తంగళ్లపల్లి(సిరిసిల్ల): తంగళ్లపల్లి జెడ్పీటీసీ పూర్మాని మంజులరెడ్డి, ఆమె భర్త పూర్మాని రాంలింగారెడ్డి సోమవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. సిరిసిల్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మహేందర్ రెడ్డి ఆధ్వర్యంలో, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీ జెండా కప్పుకున్నారు. అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. చక్రధర్‌రెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు జాలగం ప్రవీన్ (టోని) తదితరులు ఉన్నారు.

కొనుగోలు కేంద్రానికి విద్యుత్ సౌకర్యం కల్పించాలి

బోయినపల్లి: మండలంలోని మల్కాపూర్‌లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో విద్యుత్ సౌకర్యం కల్పించాలని కోరుతూ గ్రామస్తులు సెస్ ఏఈ ప్రశాంత్‌కు సోమవారం వినతిపత్రం అందించారు. బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి పరశురామ్ మాట్లాడుతూ గ్రామంలోని బీరయ్య బోరు వద్ద గల ప్రభుత్వ భూమిలో ఆరేళ్లుగా కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ సౌకర్యం లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కిసాన్ మోర్చా మండల కార్యదర్శి అమిరిశెట్టి గంగయ్య, జాగీరు వేణు, బొంగోని ప్రదీప్, అంజయ్య, వినయ్, శ్రీనివాస్ ఉన్నారు.

నిజాయితీ చాటుకున్న కానిస్టేబుల్


ఫోన్‌ను అప్పగిస్తున్న చందుర్తి సీఐ

చందుర్తి: బస్టాండ్‌లో దొరికిన ఫోన్‌ను బాధితురాలికి అప్పగించి ఓ కానిస్టేబుల్ తన నిజాయితీ చాటుకున్నాడు. కరీంనగర్‌కు చెందిన స్వప్న చందుర్తిలోని బంధువుల ఇంటికొచ్చి వెళ్తుండగా స్థానిక బస్టాండ్‌లో తన సెల్‌ఫోన్‌ను పోగొట్టుకుంది. ఫోన్ దొరికిన కానిస్టేబుల్ సతీశ్ దానిని సీఐ కిరణ్‌కుమార్‌కు అప్పగించారు. ఫోన్ పోగొట్టుకున్న మహిళను గుర్తించి ఫోన్‌ను అప్పగించారు.



ఫ్రెషర్స్.. అదుర్స్

తంగళ్లపల్లి: స్థానిక తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో సోమవారం ఫ్రెషర్స్ పార్టీ ఉత్సాహంగా సాగింది. కళాశాలలో నూతనంగా చేరిన విద్యార్థినులకు సీనియర్ విద్యార్థినులు స్వాగతం పలికారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రజని, వైస్ ప్రిన్సిపాల్ సుధాసింధు, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.



హరే రామ..హరే కృష్ణ

సిరిసిల్లటౌన్: కార్మికక్షేత్రం సిరిసిల్ల భక్తి పారవశ్యంలో తేలియాడింది. నగరంలో సోమవారం రాత్రి హరే రామ..హరే కృష్ణ మంత్రం ప్రతిధ్వనించింది. శ్రీమద్భగవద్గీత జయంతి సందర్భంగా అంతర్జాతీయ కృష్ణచైతన్య సంఘం ఆధ్వర్యంలో అశేష భక్తులతో నగర సంకీర్తన చేపట్టారు. శ్రీకృష్ణుడిని స్మరిస్తూ ఆటపాటలు, భజనలతో హోరెత్తించారు. బీజేపీ, శ్రీరామ జన్మ భూమి తీర్థ క్షేత్ర ట్రస్టు ఆధ్వర్యంలో అయోధ్య రాముడి అక్షింతల శోభాయాత్ర నిర్వహించారు. ప్రాణనాథ అచ్యుతప్రభు, చైతన్య అవతార్‌ప్రభు, నాయకులు నాగుల శ్రీనివాస్, ఆడెపు రవీందర్, చేపూరి అశోక్, శ్రీకాంత్‌రెడ్డి, దార్నం అరుణ, గూడూరి భాస్కర్ ఉన్నారు.

రక్తదాతకు అవార్డు

వేములవాడఅర్బన్: సామాజిక సేవలో భాగంగా రక్తదానం చేస్తున్న దురిశెట్టి అరుణ్‌తేజాచారికి మెగా ఎంటర్‌ప్రైజెస్, వంశీ ఫిలిం చాంబర్ సౌజన్యంతో 2022–23 సంవత్సరానికి అవార్డును ఆదివారం అందుకున్నారు. ఇప్పటి వరకు 81 సార్లు రక్తదానం చేసినందుకు హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో సినీనటి సరయు చేతుల మీదుగా అవార్డు అందుకున్నాడు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

సిరిసిల్లటౌన్: పట్టణంలోని శాంతినగర్, శ్రీనగర్ కాలనీ, రాళ్లబావి, అంబేడ్కర్‌నగర్ సుభాష్‌నగర్, విద్యానగర్, గాంధీనగర్, మార్కండేయ వీధి, మెహెర్‌నగర్, పాతబస్టాండు, రగుడు, కలెక్టరేట్ ప్రాంతం, రెడ్డివాడ, గీతానగర్, ఆసిఫ్‌పుర, ఆటోనగర్, కోర్టు ఏరియా, సిద్దులవాడ, సుందరయ్యనగర్, శివనగర్, పద్మనగర్, అంబికానగర్, జేపీనగర్, వెంకంపేట, అనంతనగర్, అశోక్‌నగర్, సర్దార్‌నగర్, సంజీవయ్యనగర్, రాజీవ్‌నగర్, ముష్టిపల్లి, బోనాల, చంద్రంపేట ప్రాంతాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సెస్ ఎండీ సురేందర్‌రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.





క్యాంప్ ఫైర్ జోష్

సిరిసిల్ల: విద్యానగర్‌కాలనీలో ఆదివారం రాత్రి క్యాంప్ ఫైర్ అలరించింది. స్థానికులు శీతాకాలం వేడుకల్లో భాగంగా క్యాంప్‌ఫైర్ ఏర్పాటు చేసుకున్నారు. చలిమంటలు కాగుతూ.. కంకులు కాల్చుకున్నారు. స్థానికులు బొల్లి రామ్మోహన్, ఎల్లారెడ్డి, రాజు, శ్రీనివాస్‌రెడ్డి, స్థానిక మహిళలు పాల్గొన్నారు.